హెచ్చరిక బోర్డులు మాయం



కొమ్మాది కూడలి సమీపంలో మధురవాడ సర్వే నంబరు 18లో కనిపించని ప్రభుత్వ హెచ్చరిక బోర్డు



కొమ్మాది కూడలి వద్ద మధురవాడ సర్వే నంబరు 18లో హెచ్చరిక బోర్డు మాయం చేసి వ్యాపారాల నిర్వహణ

- రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములకు ఎసరు
- ముందు బోర్డు తొలగించి ఆపై అద్దెకు స్థలాలు
- ఇదీ మధురవాడ, పరదేశిపాలెం గ్రామాల్లో పరిస్థితి
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

మధురవాడ : మధురవాడ, పరదేశిపాలెం, ఇతర రెవెన్యూ గ్రామాల్లో అక్రమార్కులు ప్రభుత్వ భూములు కాజేసి కోట్ల రూపాయలు సంపాదించడానికి అనేక కొత్త అవతారాలు ఎత్తుతున్నారు. కొందరు సాక్షాత్తు జిల్లా మెజిస్ట్రేట్ కలెక్టర్ పేరుతో ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డులను మాయం చేసేసి ఆ భూములను ఇష్టానుసారంగా వాడుకుంటున్నారు. మరికొందరు బోర్డులను తీసేసి ఆ భూములను ప్లాట్లుగా విభజించి అద్దెకి ఇచ్చి బడ్డీలు, దుకాణాలు ఏర్పాటు చేసి ఎంచక్కా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. మరికొందరు బోర్డును అలాగే ఉంచి అది కనిపించకుండా జిమ్మిక్కులు చేస్తున్నారు. తాజాగా శివశక్తి నగర్‌కి అత్యంత సమీపంలో ఉన్న మధురవాడ సర్వే నంబరు 96/7లో అక్రమార్కులు బోర్డు తీసేసి పక్కనే ఉన్న తుప్పల్లో పడేశారు. తర్వాత అధికారులు మరో బోర్డు ఏర్పాటు చేశారు తప్ప అక్రమార్కులపై చర్యలు మాత్రం చేపట్టలేదు. ఇదో ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి మరికొన్ని కూడా ఉన్నాయి. మరో విచిత్రం ఏమిటంటే కొమ్మాది కూడలి సమీపంలో కోర్టు వివాదంలో ఉన్న ప్రభుత్వ భూమిలో న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు భూమి దున్ని, చెట్లు నాటితే సచివాలయ వీఆర్వోలు నామమాత్రంగా వాటిని ధ్వంసం చేశారు. ఉన్నతాధికారులు కనీసం స్పందించనే లేదు.

టీడీపీ నాయకులే సూత్రధారులు

కొమ్మాది కూడలికి అత్యంత సమీపంలో మధురవాడ సర్వే నంబరు 18లో సుమారు 9 ఎకరాలు డి ఫారం భూమి ఉంది. దీని అసైన్‌మెంట్‌ను ప్రభుత్వం 2007లో రద్దు చేసింది. అందులో 2 ఎకరాలు వాగు, మరో 2 ఎకరాలు జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ కాలనీకి, మరో 5 ఎకరాలు వుడాకి కేటాయించారు. అసైన్‌మెంట్ రద్దు చేయడంతో కొందరు కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం వివాదం న్యాయస్థానంలో నడుస్తోంది. అయినా ఆ భూమిని 5వ వార్డులో పలుకుబడి ఉన్న టీడీపీ నాయకుల అండతో క్రయవిక్రయాలు, నిర్మాణాలు చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుండడంతో రెవెన్యూ అధికారులు కొన్నాళ్ల కిందట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ భూమిలో హెచ్చరిక బోర్డు కనిపించకుండా మొదట రేకులు అడ్డంపెట్టి... తర్వాత గుట్టుగా బోర్డును మాయం చేసేశారు. ఇప్పుడు తాజాగా రోడ్డును ఆనుకుని ఉన్న అర ఎకరం మేర ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్‌లుగా విభజించి చికెన్, మటన్, కర్రలు, మార్బుల్, స్క్రాప్ ఇతర దుకాణాలకు అద్దెకు ఇచ్చి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా కోర్టును తప్పుదోవ పట్టించేందుకు భూమిని దున్ని, మొక్కలు నాటారు. అయినప్పటికీ సచివాలయ వీఆర్వోలు మమ అన్నట్టు చర్యలు చేపట్టారు. ఇంత జరుగుతున్నా కోట్ల రూపాయల విలువ చేసే భూమి పరిరక్షణలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి.

- శక్తినగర్ చిలుకూరి లే అవుట్‌ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించేందుకు ప్రయత్నించగా... 'ప్రభుత్వ భూమి ఆక్రమణకు స్కెచ్' అన్న శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు షెడ్ తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తర్వాత రాత్రికి రాత్రే ఆ బోర్డును సదరు ఆక్రమణదారులు దొంగతనంగా తీసేసి తుప్పల్లో పడేశారు. తర్వాత స్పందించిన అధికారులు మరో బోర్డు ఏర్పాటు చేశారు తప్ప అక్రమార్కులపై చర్యలు మాత్రం చేపట్టలేదు.
- పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 33లోని పలు సబ్ డివిజన్లలో సుమారు 2 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని కొద్ది నెలల క్రితం స్థానికులు ఫిర్యాదు చేయడంతో గత తహసీల్దార్ లోకవరపు రామారావు ఆధ్వర్యంలో సర్వే చేసి జాతీయర రహదారిని ఆనుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అది కొద్ది రోజులకే మాయమైంది.
- ఇదే రెవెన్యూ గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని సర్వే నంబరు 35లో గత ఏడాది ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కొందరు వ్యక్తులు మాయం చేసి దర్జాగా వ్యాపార కార్యకలాపాలు చేస్తున్నారు.
- సర్వే నంబరు 34లో సుమారు 5 సెంట్ల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాట చేసి తర్వాత రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు కనిపించకుండా రకరకాల చర్యలు చేపడుతూ క్రమేణా తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు.
- మారికవలస వద్ద జాతీయ రహదారిని అనుకుని ఉన్న విలువైన భూముల్లో కూడా హెచ్చరిక బోర్డులు మాయమయ్యాయి. అలాగే డీ ఫారమ్ భూముల్లో కొందరు వ్యక్తులు బడ్డీలు ఏర్పాటు చేసి అద్దెలకి ఇచ్చి వ్యాపారం చేస్తున్నారు. ఇంకొందరు శాశ్వత పద్ధతిలో దుకాణాలు, ఏటీఎమ్‌లకు కూడా అద్దెకిస్తున్నారు.



పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం 35లో హైవేని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు మాయం చేసి నిర్వహిస్తున్న వ్యాపారాలు

హోమియో మందుల పంపిణీ



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మంది రోగులను వైద్యులు టి.జగన్నాథరావు, టీజే మోహన్ పరీక్షించి అవసరమైన మందులు అందించారు. శిబిరంలో ఫౌండేషన్ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, కె.చంద్రశేఖరరావు, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.లక్ష్మణరావు, వి.శ్రీనివాసరావు, వి.రాంబాబు, ఎం.శంకర్, ఎన్.అశోక్, గంధ రాము, రాజు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాల అందజేత



నోటు పుస్తకాలతో ఎస్‌వోఎస్ పిల్లలు

భీమునిపట్నం: భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమారుడు ముత్తంశెట్టి శివ నందీష్ జన్మదినాన్ని ఆదివారం ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ కేక్ కట్ చేయడంతో పాటు పిల్లలకు నోటు పుస్తకాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడి పిల్లలకు తమ వంతు అవసరమైన సాయం అందిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులతో అవస్థలు



శిథిలమై గోతులు తేలిన రోడ్డు

పద్మనాభం: మండలంలోని నరసాపురం జంక్షన్‌కు అర కిలో మీటరు దూరంలో రోడ్డు శిథిలమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపు వద్ద రోడ్డు గోతులు పడడంతో ఆటోలు, లారీలు వంటి వాహనాలు ఎదురుగా వచ్చేటప్పపడు తప్పించేందుకు ప్రయత్నించి ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు



ప్రసంగిస్తున్న ప్రధానార్చకుడు శేషాచార్యులు

సీతంపేట: ప్రపంచ సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యుల జీవితమే ఒక గొప్ప సందేశమని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు గోపినంబాళ్ల శేషాచార్యులు పేర్కొన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీమద్రామానుజాచార్యుల విశిష్టతపై ఆయన ప్రసంగించారు. 1017–1137 మధ్య కాలంలో జీవించిన శ్రీమద్రామాజానుచార్యులు విశిష్ట ద్వైతాన్ని ప్రతిపాదించిన గొప్ప తత్వవేత్త, హేతువాది, యోగి అని కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ సర్వమత సారం ఒక్కటేనని బోధించి, దాన్ని ఆచరించి ప్రజలకు వివరించిన సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు నేటి తరానికి ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త రాంభట్ల నృశింహశర్మ, దయాల్ సుబ్రహ్మణ్యం, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం



దాకమర్రి రఘు కళాశాల వద్ద కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేంద్రాల్లో ఆదివారం కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు సీఐ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. 2,704 మంది పురుష, 904 మంది మహిళా అభ్యర్థులు కలిపి మొత్తం 3,608 మందికి చెరకుపల్లి అవంతి ఇంజనీరింగ్ కళాశాల, భీమిలి మండలం దాకమర్రి వైజాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రఘు ఇంజినీరింగ్ కళాశాల, రఘు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. పరీక్ష ప్రారంభమైన 10 గంటలకు కేంద్రాల గేట్లకు తాళాలు వేశారు.

పరీక్ష ప్రారంభమైన తర్వాత విజయనగరం జిల్లా దత్తిరాజేరు, జామి, శ్రీకాకుళం జిల్లా పాలకొండ తదితర దూరప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులను స్వల్ప కాలవ్యవధిలో అధికారుల అనుమతితో లోపలికి అనుమతించారు. పక్క జిల్లాల నుంచి వచ్చిన కొందరు అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడంలో కొంత అయోమయానికి గురయ్యారు. భీమిలి మండలం దాకమర్రి వైజాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రం రాజాపులోవ – రాయ్‌పూర్ జాతీయ రహదారికి కిలోమీటరున్నర దూరంలో ఉండటంతో భీమిలి పోలీసులు అభ్యర్థులను సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేర్చి సహకరించారు. చెరకుపల్లి అవంతి ఇంజనీరింగ్ కళాశాల వద్ద కూడా పోలీసులు చివరి నిమిషంలో అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు తమ ద్విచక్ర వాహనాలపై చేర్చారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

312 మంది గైర్హాజరు

ఆనందపురం : మండలంలోని ఆరు కేంద్రాల్లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక కోసం ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరు కేంద్రాల్లో 4,228 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 312 మంది హాజరు కాలేదు. గుడిలోవలోని ఏ క్యూజే పీజీ సెంటర్ – ఎలో 528 మందికి 483 మంది, ఇక్కడే బి సెంటర్‌లో 500 మందికి 450, మిందివానిపాలెం వీతం ఇంజినీరింగ్ కళాశాలలో 280 మందికి 267, శొంఠ్యాం ఎన్ఎస్ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 1000 మందికి 939, గిడిజాల సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాలలో 1200 మందికి 1130 మంది హాజరయ్యారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. సీఐ రామచంద్రరావు కేంద్రాల వద్ద పరిశీలించారు.



ఆఖరి నిమిషంలో ఆనందపురం పరీక్ష కేంద్రంలోకి పరుగు తీస్తున్న అభ్యర్థి



చెరకుపల్లి అవంతి కళాశాల కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

ముగిసిన శిక్షణ తరగతులు



ప్రసంగిస్తున్న చిన జీయర్ స్వామి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు వారిజా నేత్ర విద్యాలయంలో రెండు రోజుల నుంచి కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి వికాస తరంగిణి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. త్రిదండి చిన జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సాగిన ఈ శిక్షణ తరగతుల్లో ముందుగా భక్తులకు తీర్థ ఘోష్టి నిర్వహించి ప్రసంగించారు. ఈ శిక్షణలో సంస్కార వికాస్, ప్రజ్ఞ, వేద పాఠశాల, అంధుల పాఠశాల, గిరిజన పాఠశాల, గో సంరక్షణ, ఆలయాల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు.

తెలుగు వారంతా గిడుగుకు రుణపడి ఉండాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస: గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు అని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. ఆదివారం గిడుగు వర్ధంతి సందర్భంగా భీమిలిలోని నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి చదువు దగ్గర చేసి సామాజిక తారతమ్యాలు దూరం కావడానికి గిడుగు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా తెలుగు వారంతా ఆయనకు రుణపడి ఉండాలన్నారు. బహుభాషా కోవిదుడు, శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త అయిన రామ్మూర్తి పంతులు ఈ పుణ్యభూమిలో జన్మించడం మన అదృష్టమన్నారు. ఈ సందర్భంగా హిందీ విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలతో రాష్ట్ర ప్రజలకు మేలు

తగరపువలస: వలంటీర్ల సేవలతో రాష్ట్ర ప్రజలు దీమాగా ఉంటే చంద్రబాబు, రామోజీరావు మాత్రం వారిపై విషం చిమ్ముతున్నారని వైఎస్సార్ సీపీ ఒకటో వార్డు నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక పీఏసీఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు మాట్లాడారు. మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతుంటే ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు ఓర్వలేకపోతున్నాయన్నారు. సంక్షేమ పథకాలను అవినీతికి తావులేకుండా వలంటీర్లు లబ్ధిదారుల గడప ముంగిటకు చేర్చడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నప్పుడు రామోజీరావుకు కనిపించలేదా అని ప్రశ్నించారు. వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ మాట్లాడుతూ కోవిడ్ వంటి కష్టకాలంలో చంద్రబాబు కుటుంబంతో హైదరాబాద్ పారిపోయి దుప్పటి కప్పుకుంటే వలంటీర్లే ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, నాయకులు చింతగుంట శివ, పందిరి విజయ్, గిడుతూరి మురళి, నీలాపు రామిరెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, వెంపాడ వెంకటరమణ, గిడుతూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు

వలంటీర్లపై దుష్ప్రచారం తగదు

భీమునిపట్నం: ప్రజలందరికీ గొప్ప సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థపై టీడీపీతోపాటు కొన్ని పత్రికలు అర్థం లేని దుష్ప్రచారం సాగిస్తున్నాయని వైఎస్సార్ సీపీ 3వ వార్డు ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు అన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పథకాలు అందించాలనే ఉద్దేశంతో వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. వలంటీర్లను ఇష్టం వచ్చినట్టు విమర్శించడంతోపాటు, కొన్ని పత్రికల్లో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని... ఇది చాలా దారుణమన్నారు. పార్టీ రెండో వార్డు ఇన్‌చార్జి ఎస్.కరుణాకరరెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు చిల్ల భాస్కరరెడ్డి, వాసుపల్లి ఎల్లాజీరావు, బింగి హరికిరణ్‌రెడ్డి, శిల్ల వంశీరెడ్డి, సీరపు రాములు, బి.రాజారావు, వాసుపల్లి హరిబాబు, మునకాల ఆదినారాయణ పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజా సేవకులు

ఆనందపురం : సచివాలయాల పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు ప్రజా సేవకులని, వారిని టీడీపీ నాయకులు విమర్శించడం దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బంక సత్యం అన్నారు. ఆనందపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించడం అర్థరహితమన్నారు. ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీన తెల్లవారుజామునే ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు అందించడం తప్పా అని ప్రశ్నించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు వేసి ప్రజాధనాన్ని లూటీ చేసిందని ఆరోపించారు. టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి చెట్లు, చేమలను దోచుకున్నారని చెప్పారు. కరోనా కష్ట కాలంలో వలంటీర్ల సేవలను దేశ వ్యాప్తంగా కొనియాడారని గుర్తు చేశారు. టీడీపీ, ఇతర ప్రతిపక్ష నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సమావేశంలో జెట్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మండల ఉపాధ్యక్షులు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, రామకృష్ణ, కోరాడ అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షణ్ముఖరావు

కేజీబీవీ విద్యార్థినికి అభినందనలు



ప్రియాంక

భీమునిపట్నం: భీమిలి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపింది. ఇక్కడ పదో తరగతి చదువుతున్న బి.ప్రియాంక ఇటీవల విజయవాడలో జరిగిన అండర్ – 21 శాఫ్ లీగ్ షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ప్రిన్సిపాల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు ప్రియాంకను ఆదివారం అభినందించారు.

బంగ్లామెట్ట నుంచి సర్వీస్ రోడ్డులోకి రాకపోకలు బంద్

500 కుటుంబాల ప్రజలకు అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రజలకు జాతీయ రహదారి వైపు సర్వీస్‌రోడ్డులోకి రాకపోకలు నిలిచిపోయాయి. బంగ్లామెట్ట నుంచి సర్వీస్‌రోడ్డుకు అనుసంధానంగా ఉన్న మార్గాన్ని ఆరుమాసాల క్రితం జీవీఎంసీ అధికారులు డ్రైనేజీ నిర్మాణం కోసం తొలగించారు. తర్వాత దాన్ని పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం బంగ్లామెట్ట ప్రజలు తగరపువలస ప్రధాన రహదారి వైపు నుంచి వచ్చి చుట్టూ తిరిగి సర్వీస్ రోడ్డులోకి రావాల్సి వస్తోంది. బంగ్లామెట్ట బాలుర వసతి గృహం నుంచి నేరుగా సర్వీస్ రోడ్డులోకి దగ్గర మార్గం కావడంతో దానిని పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఇటు వైపు మార్గం కూల్చేయడంతో స్థానికులు అయిదు అడుగులు కిందకు ఉన్న సర్వీస్‌రోడ్డులోకి అష్టకష్టాలు పడి నడకమార్గాన చేరుకుంటున్నారు. ద్విచక్ర వాహనదారులకు మాత్రం సర్వీస్‌రోడ్డులోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది.

రక్షణగోడ లేక జారుతున్న మెట్ట భాగం..

బంగ్లామెట్ట సర్వీస్‌రోడ్డు వైపు భాగం కొండవాలు చివరి భాగం కావడంతో తరచూ రాళ్లు, గ్రావెల్ రోడ్డుమీదకు జారి పడుతున్నాయి. అలాగే బాలుర వసతి గృహం ముందు భాగం నుంచి సర్వీస్‌రోడ్డు కూడా ఏటవాలుగా ఉండటంతో ఇక్కడ నడకదారిన వెళ్లేవారు కూడా జారిపడుతున్నారు. సర్వీస్ రోడ్డు వైపు రాకపోకలు సాగించేందుకు నడిచి వెళ్లేవారికి మెట్ల మార్గం, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మించాలని బంగ్లామెట్టపై నివాసం సాగిస్తున్న 500 కుటుంబాల ప్రజలు కోరుతున్నారు.



వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేక ఇరుకైన వసతిగృహం సందును వినియోగిస్తున్న స్థానికులు